క్లుప్తంగా

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ హైస్కూల్ విద్యార్థులకు డీఈవో అశోక్ యూనిఫామ్, టై, బెల్టు, చూచి రాతబుక్‌లను సోమవారం అందజేశారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు బాగా విని మంచి చదువులు చదివి ఉన్నతస్థాయికి ఎదగాలకి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు, ఘన్‌పూర్ అధ్యాపకుల బృందం, వీడీసీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరంగల్‌లో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



నిజామాబాద్ సిటీ: వరంగల్‌లో జరుగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సభకు జిల్లా కాంగ్రెస్ నాయకులకు పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పజెప్పింది. సభాస్థలి ఏర్పాట్లను నుడా చైర్మన్ కేశ వేణును అబ్జర్వర్‌గా నియమించారు. సోమవారం ఆయన సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక నాయకులతో కేశ వేణు కలిసి పనులు వేగవంతంగా అయ్యేలా సభావేదిక ఏర్పాట్లు, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



నిజామాబాద్‌అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సర్కిల పోశెట్టి డిమాండ్ చేశారు. సోమవారం ధర్నాచౌక్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న పెన్షన్‌దారుల ఆవేదన సభను హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీక్షలో నాయకులు కనక ప్రమోద్, నారాయణ, సలీం, కృష్ణవేణి, గంగాధర్ తిరుమల్, పర్వీన్ బేగం, అలివేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి



నిజామాబాద్‌అర్బన్: అమరవీరుల స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభను నగరంలో బీసీ హాస్టల్‌లో నిర్వహిచారు. కార్యక్రమంలో నాయకులు సాయి కిరణ్, ప్రమోద్, అక్షయ్ పాల్గొన్నారు.

టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: మాక్లూర్‌లోని కేజీబీవీలో బంగారు గొలుసు పోయిందని ఓ విద్యార్థినిని మంత్రగాడి దగ్గరికి తీసుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్ మాట్లాడుతూ.. కేజీబీవీలో 6వ తరగతి విద్యార్థినిని మంత్రగాడికి దగ్గరికి తీసుకెళ్లిన ఘటనలో ప్రధాన బాధ్యులైన సోషల్ సీఆర్టీ గౌతమి రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనకు సంబంధం లేని అమాయకులైన ముగ్గురిని బదిలీ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. తక్షణమే సీఆర్టీ గౌతమిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో అషూర్, సజన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిమిక్రీ కళాకారులను ప్రోత్సహించాలి



నిజామాబాద్‌రూరల్: మిమిక్రీ కళాకారులను ప్రోత్సహించాలని మావా ప్రెసిడెంట్ జీవీఎస్ రాజు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సీసీఆర్‌టీ మాదాపూర్ వేదికగా మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల మిమిక్రీ కళాసెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన సీనియర్ మిమిక్రీ కళాకారుడు శంకర్, దీక్షిత్, రాజు పాల్గొన్నారు. అనంతరం డిసెంబర్ 28న ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ పద్మశ్రీ నేరేళ్ల వేణుమాదవ్ జన్మదినం సందర్భంగా ప్రపంచ మిమిక్రీ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన మిమిక్రీ ఆర్టిస్ట్‌లను జీవీఎస్‌రాజు వారి బృందం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ శివరెడ్డి, సెక్రటరీ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. కోట్లు వెచ్చించి.. వృథాగా వదిలేసి..

- రూ.7 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం
- కోర్టు కేసుతో పంపిణీ నిలిపివేత
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



మార్కెట్ యార్డు ముందే విక్రయాలు

నిజామాబాద్ సిటీ: రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వాడకంలో లేకపోవడంతో వెలవెలబోతోంది. ప్రజలకు ఉపయోగపడాల్సిన భవనాలు వృథాగా మారుతుండడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భవనాలను నిర్మించినా వాడుకలో లేకపోవడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి.

అన్నీ ఒకేచోట..

నగరంలో పలుచోట్ల కూరగాయలు, చికెన్, మటన్, ఫిష్ మార్కెట్లు ఉన్నాయి. వీటన్నింటిని ఒకేచోట విక్రయించేలా విశాలమైన స్థలంలో సమీకృత మార్కెట్‌యార్డు నిర్మాణం చేపట్టారు. బోధన్ బస్టాండ్ వెనుక రూ.7 కోట్ల నిధులతో 98 గదులు నిర్మాణంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం రూపుదిద్దుకుంది.

స్థల వివాదం.. కోర్టులో కేసు

మున్సిపల్ నిధులతో (రూ.7 కోట్లు) నిర్మించిన ఈ మార్కెట్ యార్డు రెండేళ్ల క్రితం పూర్తయింది. లబ్ధిదారులకు పంపిణీ చేసే సమయంలో కొందరు ఈ స్థలం తమదేనని కోర్టులో కేసువేశారు. మిర్యాల్‌కర్ కుటుంబానికి చెందిన 10 మంది సభ్యులు ఈ స్థలం తమ తాతల కాలం నుంచి తమ ఆధీనంలో ఉందని, ఇక్కడే మేకల మండి నిర్వహిస్తున్నామని మాణిక్ మిర్యాల్‌కర్ తెలిపారు. సదరు స్థలం కూడా తమ తాత పేరుమీదే ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు తమకు సమచారం ఇవ్వకుండా మార్కెట్ భవనం నిర్మించారని వాపోయారు. నిర్మాణ సమయంలో తాము ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినా అధికారులు మామాట వినకుండా నిర్మాణం చేపట్టారన్నారు. తాము న్యాయం కోసం హైకోర్టులో కేసు వేశాం. ఈనెల 24న హియరింగ్ ఉందన్నారు. మా స్థలంలో నిర్మాణ పనులు చేపట్టినందున ప్రస్తుతం రెండు షెట్టర్లలో మేకల విక్రయాలు జరుపుతున్నాం. మేమే అసలైన హక్కుదారులమని మాణిక్ మిర్యాల్‌కర్ పేర్కొన్నారు.

రోడ్డుపైనే చికెన్, మటన్ విక్రయాలు

నగర కేంద్రంలో విశాల స్థలంలో నిర్మించిన కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే ఒకేచోట కార్యకలాపాలు నిర్వహించవచ్చని భావించారు. అయితే కాంప్లెక్స్ భవనం పూర్తయినా దుకాణాలను లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో విక్రయదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దాంతో ఎప్పటిమాదిరిగానే రోడ్డు, కాంప్లెక్స్ ఎదుట మటన్, చికెన్, ఫిష్ విక్రయిస్తున్నారు. దీంతో ఎప్పటి మాదిరిగానే ఈ మార్గం అశుభ్రతతో నిండిపోతోంది.

కాంప్లెక్స్ భవనంలో 98 గదులున్నాయి. అధికారులు వేసిన షెట్టర్లకు కొందరు తాళాలు పగులగొట్టారు. కొన్ని గదుల్లో తమ సామాగ్రి పెట్టుకున్నారు. కొందరు విశ్రాంతి తీసుకుంటున్నారు. మత్తుపదార్థాలు సేవించి గదుల్లో నిద్రిస్తున్నారు. గుట్కా, గంజాయి వంటి మత్తుపదార్థాలు సేవించే కేంద్రాలుగా అవి మారాయి.

రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. గొడవలు, కత్తిపోట్ల వంటి ఘటనలు కూడా జరిగిన ఘటనలు ఉన్నాయి. బిచ్చగాళ్లు, మత్తుకు బానిసైన వారికి అడ్డాగా మారిపోతోంది. పగలు, రాత్రిళ్లు నేరాలకు అడ్డాగా ఈ కాంప్లెక్స్ మారిందని పలువురు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా దీన్ని వాడుకలోకి తీసుకురావడంలో అధికారుల విఫలమయ్యారు. ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు మారారు. వారిలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు సైతం ఏమీ చేయలేకపోయారు. కొత్తగా వచ్చిన కమిషనర్ అయినా దృష్టిసారించి వాడుకలోకి తీసుకురావాలని వ్యాపారులు కోరుతున్నారు.



కాంప్లెక్స్ లోపల చెత్తాచెదారం



మురికినీటితో నిండిన సెల్లార్



మేకల విక్రయాలు చేస్తున్న దృశ్యం

రోడ్డుమీదనే విక్రయిస్తున్నాం



మా తాత్కాలిక దుకాణాలకు షెట్టర్లు కట్టిస్తామంటే స్థలం ఖాళీ చేశాం. ఏళ్లు గడుస్తున్నా ఇంకా షెట్టర్లు కేటాయించలేదు. ఇప్పటికీ రోడ్లమీదనే దుకాణాలు నడుపుతున్నాం. పర్మినెంట్ దుకాణాలు కేటాయించాలి. – మహ్మద్, మటన్ విక్రయదారు

అధికారులు దృష్టి సారించాలి



మార్కెట్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నాయి. పై అంతస్తులో మద్యం, గుట్కా, గంజా సేవిస్తున్నారు. రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అధికారులు దృష్టి సారించాలి. – జమీర్, చికెన్ విక్రయదారు

స్థల వివాదం హైకోర్టులో ఉంది



నేను బాధ్యతలు తీసుకోక ముందు నుంచే ఈ మార్కెట్ స్థలం వివాదంలో ఉంది. హైకోర్టులో కేసు నడుస్తోంది. కేసు పూర్తయ్యేవరకు ముందస్తు చర్యలు తీసుకోవడం కుదరదు. ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. – మురళీమోహన్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్

ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం తెయూ బాలుర హాస్టల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెయూలో ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయని, పేద విద్యార్థులు యూనివర్సిటీ విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలకు స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా ఖాళీలను భర్తీ చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నారని, కానీ వర్సిటీ క్యాంపస్‌లో కొన్నేళ్లుగా ఖాళీ సీట్లను భర్తీ చేయడం లేదని విమర్శించారు.



మాట్లాడుతున్న రవీందర్

విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఖాళీగా ఉన్న పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమండ్లు, రాకేశ్, వెంకన్న, కార్తీక్, రవీంద్రనాథ్, ప్రభాస్, తరుణ్, గౌతమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన పద్మశాలి నగర కల్యాణ మండపాన్ని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు గుజ్జెటి వెంకట నర్సయ్య, దీకొండ యాదగిరి, పుల్లం హనుమాండ్లు, ఎనగందుల మురళి, అవదూత దశరథం, గంట్యాల వెంకట నర్సయ్య, బింగి మోహన్, సత్యపాల్, దాసు, పెంటి దాసు తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెయూ ఏబీవీపీ జాయింట్ సెక్రటరీ సమీర్ డిమాండ్ చేశారు. సోమవారం తెయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.7,800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయక పోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లిస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమంటూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్, అక్షయ్, లెనిన్, నవీన్, రోహన్, శీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమీర్

‘బతుకు చిత్రం..’



పని చేస్తేగని పూటగడవని స్థితిలో ఉన్న ఓ తల్లి తన చంటి బిడ్డను పక్కన ఉయ్యాలలో పడుకోబెట్టి టీ స్టాల్ నడుపుతూ బతుకు ప్రయాణాన్ని సాగిస్తోంది. నగరంలోని బైపాస్ రోడ్డులో మూల మలుపు వద్ద ఉన్న ఓ టీ పాయింట్‌లో కనిపించిన దృశ్యాన్ని ‘సాక్షి’ తన కెమెరాలో బంధించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

సంక్షిప్తం

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలోని ఎంపీడీవో, తహసీల్దార్ ఆధ్వర్యంలో 19 గ్రామాల్లో ఇంటింటి సర్వే కొనసాగుతోంది. గ్రామాల్లో మొత్తం 8744 నివాసాలకు స్టిక్కర్లు అతికించగా అందులో సోమవారం వరకు 5711 కుటుంబాలను సర్వే పూర్తి చేశామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. వారం రోజుల్లో మండలంలోని సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సర్వేకు కుటుంబాలు పూర్తిగా సహకరించాలని కోరారు. సర్వేలో కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని 33/11 కేవీ వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవీ ఏఎస్ ఫీడర్ 11 పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏడీఈ పి వీరేశం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక్‌నగర్‌లోని హనుమాన్ జంక్షన్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, వంద ఫీట్ల రోడ్డు, ఐపీఎస్ స్కూల్ ఏరియా, గూడెం, తుల్జాభవాని ఆలయం, సాయికృపనగర్, యోగేశ్వర్ కాలనీ, ఇంద్రాణి స్కూల్, దత్తాత్రేయ ఆలయం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని టౌన్–3 ఏడీఈ పి వీరేశం కోరారు.

సింహగర్జన కరపత్రాలు విడుదల




నిజామాబాద్ నాగారం: డిసెంబర్ ఒకటిన హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన కరపత్రాలను సోమవారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. జేఏసీ జిల్లా కన్వీనర్ గైని గంగారాం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో మాలలు ఎంతో నష్టపోతారని మాదిగలు ఈ మనువాద బ్రాహ్మణ కుట్రలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ రిజర్వేషన్ 30 శాతానికి పెంచాలని, మాలలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. మాలమహానాడు నూతన నగర అధ్యక్షుడిగా సక్కి చంద్రశేఖర్‌ను నియమించి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో బంగారు సాయిలు, కేశ్‌పల్లి రవన్న, నీరడి లక్ష్మణ్, సుంకరి మోహన్, ప్రభంజన్, సిద్ధం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, శంభులింగేశ్వరాలయంలో కార్తీకమాస పూజలు కొనసాగుతున్నాయి. మూడో సోమవారం పురస్కరించుకొని నీల కంఠేశ్వర ఆలయంలో అర్చకులు, భక్తులు ఆలయ ఈవో శ్రీరాంరవీందర్‌గుప్త ఆకాశ దీపాన్ని వెలిగించారు. అనంతరం భక్తులు కార్తీక దీపాలను వెలిగించి శివునికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు జాగరణ కోసం హరికథ పారాయణం నీలకంఠేశ్వరాలయంలో చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లొంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో..



సిరికొండ: మండల కేంద్రంలోని లొంక రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలను సోమవారం వైభవంగా నిర్వహించారు. పురోహితులు దండాల నాగరాజుశర్మ ఆలయంలో లింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేపట్టారు.

రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి

ఇందల్వాయి: రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని నల్లవెల్లి సొసైటీ ఆవరణలో రూ. 65 లక్షల సహకార సంఘ నిధులతో నూతనంగా నిర్మించే రైతు శిక్షణ కేంద్రానికి ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లవెల్లి గ్రామ అభివృద్ధికి రూ. 22 కోట్లతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం అనవసరపు ప్రాజెక్టులు నిర్మించి, ఇష్టారీతిన రైతుబంధు ఇచ్చి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు. బీజేపీ తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు. వెనకబడిన తరగతుల అభివృద్ధి కోసమే సామాజిక కుల గణన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సహకార సంఘాలను బలోపేతం చేస్తామని రైతులు సంఘంలో సభ్యులుగా చేరాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, ఇమ్మడి గోపి, చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, ధన్లరాజు, సంతోష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగారెడ్డి, కొరట్‌పల్లి ఆనంద్, తేజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే వికసిత్ భారత్ సాధ్యం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



దుస్తులను ఐరన్ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: బీజేపీతోనే వికసిత్ భారత్ సాధ్యమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా బోకర్ నియోజకవర్గం కిణి, పాలజ్, దిప్లీ గ్రామాల్లో మహాయుత కూటమి అభ్యర్థి శ్రీజయ అశోక్‌రావు చౌహాన్‌తో కలిసి ధన్‌పాల్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రోహిపింపుల్ గామ్‌లో ఏర్పాటు చేసిన సభలో మాజీ సీఎం అశోక్‌రావు చౌహాన్‌తో కలిసి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహారాష్ట్రలో వ్యవసాయ రంగం, రోడ్లు, రైల్వేస్, ఇండస్ట్రీస్, ఉపాధి, అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో మహారాష్ట్రను పూర్తిగా విస్మరించిందని అన్నారు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్టీ నగర కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. నగరంలో దాదాపు 1600 డబుల్‌బెడ్ రూం ఇళ్లు వృథాగా ఉన్నాయని పేర్కొన్నారు. వాటికి మరమ్మతులు చేపట్టి ఇళ్లు లేని వారికి అందించాలని కోరారు. నాయకులు అనిత, దీపిక, వనజ, శ్రీదేవి ఉన్నారు.

26న నిరసన కార్యక్రమాలు

సిరికొండ: రైతు కార్మిక ప్రజల జీవనోపాధిని రక్షించాలని, ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న చేపట్టిన నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్కల భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పరామర్శ..

బాధిత కుటుంబాలకు పరామర్శ

జక్రాన్‌పల్లి: మండలంలోని జక్రాన్‌పల్లి, అర్గుల్, పుప్పాలపల్లి గ్రామాల్లో పలువురు బాధిత కుటుంబాలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట అనంత్‌రెడ్డి, అప్పాల రాజన్న, నర్సారెడ్డి, బాల్‌కిషన్, గంగారెడ్డి, మద్దుల రమేశ్, నర్సారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చిన్నారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్, వసంత్‌రావు, నరేశ్, వినోద్, జితేందర్‌నాయక్, వినోద్, రిక్కల సురేశ్, ఏఎంసీ డైరెక్టర్లు కనక రవి, పీర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నిజామాబాద్‌అర్బన్: నగరంలో పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సోమవారం పరామర్శించారు. అక్రమ వడ్డీ వ్యాపారుల వేదింపులతో ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త రాజు ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నగర మేయర్ నీతూ కిరణ్, సంపత్, బాల్ దాస్, కాలభైరవ శ్రీను, నాయకులు ఉన్నారు.

బార్ ఆధ్వర్యంలో నేడు కంటి వైద్యశిబిరం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు బార్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ తెలిపారు. అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కోర్టులోని రెండో ఫ్లోర్‌లో వైద్యశిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	40	గాజరుగడ్డ	70	100
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
జీరకాయ	30	50	దోసకాయ	30	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	35	60
బీర్నిసుకాయ	50	80	గోబిగడ్డ	30	60
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	90
వంకాయ	40	60	బీట్‌రూట్	50	90
పాలకూర	30	50	కరివేపాకు	50	70
మెంతికూర	70	90	చామగడ్డ	40	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	అమరన్(తెలుగు)-10.30 4.25 10.30, లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 7.40
స్క్రీన్-3	కంగువ - 10.30 4.30 10.40, అమరన్ (తెలుగు) - 1.30 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ (తెలుగు)-11.50 3.15 6.40 10.10
స్క్రీన్-2	గ్లాడియేటర్-2 (తెలుగు)-12.10 మట్కా (తెలుగు)-3.35 7.00 క(తెలుగు)-10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 11.45 3.15 6.50 లక్కీ భాస్కర్(తెలుగు)-10.25
స్క్రీన్ -4	క(తెలుగు)-1.00 లక్కీ భాస్కర్ (తెలుగు) - 4.15 గ్లాడియేటర్ (తెలుగు)- 7.30 అమరన్ (తెలుగు)- 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)